వృక్షాలకు నిప్పు ముప్పు.. 2





తగ్గిన నేరాలు.. పెరిగిన ఫైళ్లు.. 2





AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

1-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## జాతీయస్థాయి పోటీలకు గర్గుల్ విద్యార్థులు



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** మండలంలోని గర్గుల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నోముల మధుసూదన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన కోచింగ్ శిబిరంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు వీణ, భవాని ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 3 నుంచి 8 వరకు ఝార్ఖండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఎంఈఓ, పాఠశాల హెచ్ఎం ఎల్లయ్య అభినందించారు.

## తెరుచుకున్న బాబ్లీ గేట్లు



**అక్షరటుడే, ఆర్మూర్:** బాబ్లీ గేట్లు మంగళవారం తెరుచుకున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల అధికారులు కలిసి గేట్లను ఎత్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచారు. దీంతో ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోంది.

### నాలుగు నెలలపాటు..

బాబ్లీ ప్రాజెక్టు గేట్లను వర్షాకాలం సీజన్‌లో నాలుగు నెలల పాటు తెరిచి ఉంచాలని గతంలో సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పు ప్రకారం జూలై 1 నుంచి అక్టోబరు 28 వరకు గేట్లను తెరిచి ఉంచుతారు. ఆ తర్వాత ప్రాజెక్టు గేట్లను మూసివేస్తారు. మహారాష్ట్రలో కురిసే వర్షాలకు అనుగుణంగా ఈ సమయంలో ఎస్సారెస్పీకి వరద వస్తుంటుంది. ఎస్సారెస్పీ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ రావు గుప్తా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అప్పర్ గోదావరి డివిజన్ హైదరాబాద్ ఎంఎల్ ప్రాంక్లిన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాందేడ్ సీఆర్ బాన్సడ్, ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చక్రపాణి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్త రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల కొరత రావద్దు కలెక్టర్



**అక్షరటుడే, ఇందల్వాయి:** రబీ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువుల కొరత రానియవద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎరువుల గోదాములు, పశువుల ఆస్పత్రి, తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో రైతులు ఇచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రేషన్ షాపుల్లో మూడునెలలకు సరిపడా పంపిణీ చేసిన సరుకుల వివరాల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలన్నారు. ఇందల్వాయి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పశువుల ఆస్పత్రిని పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, సీనియర్ అసిస్టెంట్ గంగ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటికి ఉచితంగా మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు తగ్గట్లుగానే ఇంటింటికీ భగీరథ నీరు అందిస్తోంది. నెలనెలా నీటి బిల్లులు సైతం వసూలు చేయలేదు. దీంతో ఉచితంగా భగీరథ నీరు వస్తుందని ప్రజలు అనుకున్నారు. కాగా.. తాజాగా వారికి అధికారులు షాక్ ఇచ్చారు. ఇన్ని రోజులు సరఫరా చేసిన నీటికి సైతం బిల్లులు వసూలు చేస్తున్నారు.

-అక్షరటుడే, కామారెడ్డి

# నీటి బిల్లులు కట్టాల్సిందే..

- గ్రామాల్లో బలవంతంగా ట్యాక్స్ వసూళ్లు
- ఉచితంగా మిషన్ భగీరథ నీటి సరఫరా వట్టిమాటే..
- నల్లా బిల్లుల వసూళ్లపై ఆగ్రహం

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మిషన్ భగీరథ పథకం ప్రారంభించింది. అంతకు ముందు గ్రామాల్లో పంచాయతీ బోర్ల ద్వారా ఇంటింటికి నీటిని అందిస్తున్నారు.. అయితే భగీరథ పథకం వచ్చాక.. కొత్తగా ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్లు వేశారు. వాటి ద్వారానే ఇంటింటికి నీటిని అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని కార్యదర్శులు అంటున్నారు.

### బోర్ల నిర్వహణ కోసం..

పైప్‌లైన్ లీకేజీలు, ఇతర కారణాలతో పలు గ్రామాలకు భగీరథ నీరు రావడం లేదు. దీంతో పంచాయతీ బోర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆయా బోర్ల నిర్వహణ కోసం బిల్లులు వసూలు చేస్తున్నట్లు జీపీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఈ మేరకు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇంటి పన్నుతో పాటు నీటి బిల్లుల బకాయిలు వసూలు చేస్తున్నారు. కాగా.. రెండు మూడేళ్ల బకాయిలు సైతం కార్యదర్శులు వసూలు చేస్తుండటం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు ఉచితంగా నీరు ఇచ్చామని చెప్పి.. ఇప్పుడు కొత్తగా బిల్లులు ఇచ్చి డబ్బులు కట్టాలని అడగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### ప్రజల ఇబ్బందులు

కొన్నేళ్లుగా ప్రజలు ఇంటి పన్ను మినహా ఇతర పన్నులు చెల్లించడం లేదు. ప్రస్తుతం పంచాయతీ బోర్ల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు మోటార్లు కాలిపోవడం, ఇతరత్రా ఖర్చులు భారంగా మారాయి. దీంతో వాటి నిర్వహణ కోసం రెండు మూడేళ్లుగా పన్నులు చెల్లించని ప్రజలకు ఒక్కసారిగా రూ.2 వేలకు పైగా నీటిబిల్లు కట్టాలని కార్యదర్శులు రశీదులు చేతిలో పెడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బిల్లులు వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



### స్పష్టత లేదు..

గ్రామాల్లో నీటి సరఫరాకు సంబంధించి 2024కు ముందు మిషన్ భగీరథ మెయింటెనెన్స్ ఉండేది. 2024 నుంచి పంచాయతీలకు ఆ బాధ్యతలు అప్పగించారు. అందులో పన్ను వసూలు చేయాలా వద్దా అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. ఇదే విషయమై ఉన్నతాధికారులను అడిగితే త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. పంచాయతీల్లో మెయింటెనెన్స్ కోసం పన్ను వసూలు చేస్తుండవచ్చు. ఈవిషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు.

-శ్రీనివాస్, డీఎల్‌పీవో, కామారెడ్డి

## ఈఏపీసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈఏపీసెట్ (ఎంసెట్) మొదటిదశ ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ తెలిపారు. ఈ ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం వరకు కొనసాగుతుందన్నారు. కామారెడ్డి చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని..సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. కాగా పరిశీలనకు 823 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని తెలిపారు.

### భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నగరంలో ఇకపై నిబంధనలు కఠినతరం

**సీపీ సాయిచైతన్య వెల్లడి**

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఇకపై నిబంధనలు మరింత కఠినంగా అమలు చేస్తామని సీపీ సాయిచైతన్య వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రద్దీ ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాల ప్రాంతాల్లో కలెక్టర్ అనుమతి లేనిదే విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. అధిక శబ్దం చేసే డీజేలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలను నిషేధిస్తున్నట్లు చెప్పారు. మాల్స్, థియేటర్లు, హోటళ్లు, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల్లో ప్రజల కోసం భద్రతా ప్రమాదాలు తప్పనిసరి అన్నారు. డ్రోన్లపై నియంత్రణ చర్యలు ఉంటాయని, ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఏర్పాటు చేస్తే ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ఏవియేషన్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. గల్ఫ్ మోసాలు పెరుగుతున్న క్రమంలో ఏజెంట్లకు ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఏ-సర్టిఫికెట్ సినిమాలకు మైనర్లకు అనుమతి లేదన్నారు. బహిరంగ మద్యపానంపై కఠినంగా ఉంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



## ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతన్న

ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కారు. గాంధారి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం వద్ద యూరియా పంపిణీ చేయడం లేదని నిరసిస్తూ మంగళవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొసైటీలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోవట్లేదని పేర్కొన్నారు. రైతులకు సరిపడా యూరియా వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

- అక్షరటుడే, గాంధారి


## పోతంగల్ కలాన్‌లో అదనపు కలెక్టర్ పర్యటన

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పోతంగల్ కలాన్‌లో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కల ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పలువురు ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని సూచించారు. ఆయన వెంట డీపీవో మురళి, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మి నారాయణ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.



# గ్రూపు రాజకీయాలను పక్కన పెట్టండి..

**జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క**



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** జిల్లాలో గ్రూపు రాజకీయాలను పక్కన పెట్టి మంచి కార్యకర్తలుగా పేరు తెచ్చుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సూచించారు. నగర శివారులోని ఏవీఎం గార్డెన్‌లో నిర్వహించిన జహీరాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. నిధులు, నియామకాలు అని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ.. నిధులన్నింటినీ కేసీఆర్ కుటుంబసభ్యులు తరలించుకుపోతే.. నీళ్లన్నీ ఫామ్‌హౌజ్‌లోకి తరలించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందన్నారు. కేసీఆర్ వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని ఎద్దేవా చేశారని.. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండించిన రైతులకు రూ.500 అదనంగా ఇస్తోందని గుర్తు చేశారు.

### 4న హైదరాబాద్‌లో మీటింగ్‌కు..

హైదరాబాద్‌లో 4న జరిగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నట్లు తెలిపారు. ఒక తల్లి బిడ్డలా మనమంతా కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### సన్నబియ్యం ఇస్తున్నది తమ ప్రభుత్వమే..

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో 90 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసిందని అందులో సగానికి పైగా బిల్లులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇళ్లకు కరెంట్ అందిస్తున్నామని గుర్తు చేశారు.

### బీఆర్ఎస్ రాష్ట్రాన్ని నాశనం చేసింది..: షబ్బీర్‌అలీ

గత పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏం సాధించారని బీజేపీ నాయకులను ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ డీసీసీ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, జీవన్ రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్, లక్ష్మీకాంతారావు, సంజయ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశవేణు, నేతలు నరాల రత్నాకర్, నర్సింగ్ రావు, నరేష్ యాదవ్ సునీల్ రెడ్డి, అనిల్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, కైలాస్ శ్రీనివాస్, ఏనుగు రవీందర్ రెడ్డి, నరతదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు



**అక్షరటుడే, బోధన్:** చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలంలోని గురుకుల మహిళా కళాశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మనసుపెట్టి చదవాలని.. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకునేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

## డిజిటల్ విద్యాబోధనపై షార్ట్ ఫిలిం



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని సత్తుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'అసిస్టెడ్ లాంగ్వేజ్ – మాథ్స్ లెర్నింగ్ – ఫండమెంటల్ లిటరసీ, న్యూమెరికల్' అనే అంశంపై తీసిన షార్ట్ ఫిలింను డీఈవో రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను డిజిటల్ తరగతులవైపు ఆకర్షితులు చేయడం, డ్రాపవుట్స్ తగ్గించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. షార్ట్ ఫిలిం రూపొందించిన ఉపాధ్యాయుడు అఖిల్, సహకరించిన శెట్టిపల్లి హెచ్ఎం వసుధను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వేణు శర్మ, ఏఎక్స్ఎల్ స్టేట్ రిసోర్స్ పర్సన్ అఖిల్, ఎంఈవోలు షౌకత్, రామస్వామి, సత్యనారాయణ, ఎర్రపహడ్ కాంప్లెక్స్ హెచ్ఎం సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చార్టర్డ్ అకౌంటెంట్‌కు సన్మానం



**అక్షర టుడే, ఆర్మూర్:** పట్టణంలోని హుస్నాబాద్ గల్లి పద్మశాలి సంఘం 3వ తర్ప ఆధ్వర్యంలో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తర్ప అధ్యక్షుడు చిట్ల యగ్నేష్, కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు రాంచందర్, కోశాధికారి శ్రీనివాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అండర్-19 క్రికెట్ పోటీలకు సౌమిత్




**అక్షరటుడే, ఆర్మూర్:** కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సౌమిత్ జాతీయస్థాయి అండర్ -19 ఫిఫ్టీ బాల్ క్రికెట్ టోర్నీకి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. ఉప్లూర్ గ్రామానికి చెందిన సౌమిత్ గతనెల జూన్ 7,8 తేదీల్లో అసిఫాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లో జరిగే 3వ జాతీయస్థాయి అండర్-19 ఫిఫ్టీ బాల్ క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారని ఆయన వివరించారు.

## వీధికుక్కలు, కోతుల బెడద తీర్చండి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో కోతులు, వీధి కుక్కల బెడద తీర్చాలని పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పలు వార్డుల్లో వీధి కుక్కలు, కోతుల స్వైర విహారంతో ప్రజలు, చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతున్నారని వివరించారు. తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజేష్, మాజీ సర్పంచ్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి శంకర్, శ్రీను, కాశీనాథ్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు నోట్‌పుస్తకాల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో నోటు బుక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రజనీష్ కిరాడ్, రాస ఆనంద్, పుష్పాకర్ రావు, రాజేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రహదారుల పక్కన ఏపుగా పెరిగిన భారీ వృక్షాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. చాలా చెట్లు రోడ్లపైకి వాలిపోయి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ముందుచూపుతో రహదారులకు ఇరువైపులా మర్రిచెట్లు నాటించేవారు. కానీ కొందరు వ్యక్తులు ఈ చెట్ల మొదళ్లకు నిప్పు పెడుతున్నారు. ఫలితంగా ఈ వృక్షాలే ప్రమాదకారకాలుగా మారుతున్నాయి.

- అక్షరటుడే, లింగంపేట

# వృక్షాలకు నిప్పు ముప్పు..

- కేకేవై రహదారిపై వందేళ్ల వృక్షాలు కూలుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

సుమారు వందేళ్ల కిందట కరీంనగర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి పట్టణాలను అనుసంధానిస్తూ కేకేవై రహదారిని నిర్మించారు. ఈ రహదారికి ఇరువైపులా మర్రి వృక్షాలను నాటడంతో అవి ఇప్పుడు వందేళ్లకు పైబడ్డాయి. కాని కొందరు వ్యక్తులు వాటికి నిప్పు పెట్టడంతో అవి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

### మహా వృక్షాలకు నిప్పు

కేకేవై రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాల కారణంగా పక్కనే ఉన్న వ్యవసాయ భూములకు నీడ రావడం, కోతులు కూడా చెట్లపైనే ఉంటున్నాయి. ఈ కోతుల వల్ల తమ పంటకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో కొందరు రైతులు ఈ చెట్లకు నిప్పు పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్నాళ్లకు ఎండిపోతున్న చెట్లు భారీ ఈదురుగాలులకు రోడ్లపై పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో వర్షం పడితే చాలు చెట్లు కూలి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

### లింగంపేట మండల కేంద్రంలో..

లింగంపేట మండలం కేంద్రంలో నాలుగేళ్ల



క్రితం మర్రి చెట్టు కూలడంతో మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన రైతు విఠల్ రెడ్డి మృతి చెందాడు. ఆరు నెలల క్రితం మర్రిచెట్టు కూలడంతో లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన అన్నం సాయిలు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### తృటిలో ప్రాణాపాయం తప్పింది..



ఆర్నెళ్ల క్రితం లింగంపేటకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు మర్రి చెట్టు కొమ్మ మీద పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డాను. అధికారులు ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాలి. నిప్పు పెట్టడం వల్లే చెట్లు ఎండిపోయి వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. – అన్నం సాయిలు, మెంగారం

## పింఛన్ డబ్బులను బ్యాంక్ ఖాతాల్లోనే జమచేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** పింఛన్‌దారులకు ప్రతినెలా అందించే డబ్బులను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని దోమకొండ మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి తిర్మల్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. మండలంలో 7,291 పింఛన్‌దారులుండగా, ఒక్క దోమకొండలోనే 3,270 లబ్ధిదారులు ఉన్నారన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమయ్యేలా చూడాలని విన్నవించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు సీతారాం, మధు ఉన్నారు.

## బీఎడ్, బీపెడ్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల


**అక్షరటుడే, ఇందల్వాయి:** తెయూ పరిధిలోని బీఎడ్, బీపెడ్ విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు వర్సిటీ పరీక్షల విభాగం నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. 2024-25 బ్యాచ్‌కు చెందిన రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులతోపాటు 2021 నుంచి బ్యాక్‌లాగ్ ఉన్న ఒకటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈనెల 14 వరకు చెల్లించవచ్చని, రూ.వంద అపరాధ రుసుముతో 15వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు.




## బోధన్‌లో ఖైదీ పరారీ

**అక్షరటుడే, బోధన్:** పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఖైదీ పరారైన ఘటన బోధన్ మండలం నాగంపల్లిలో జరిగింది. వర్ని మండలానికి చెందిన ఖైదీ ఓ హత్య కేసులో జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. నాగంపల్లి శివారులోని జైళ్ల శాఖ పెట్రోల్ పంపులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం పని ముగించుకుని డబ్బులతో బైక్‌పై పరారయ్యాడు. సాయంత్రం జిల్లా జైలుకు రాకపోవడంతో జైలు అధికారులు అప్రమత్తమై బోధన్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. పరారైన ఖైదీ వివరాలు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. పూర్తి వివరాలు వెల్లడిస్తామని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

## విద్యుత్ స్తంభానికి మంటలు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మండలం ఉగ్రవాయి నుంచి క్యాసంపల్లి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభంపై మంగళవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఉదయం నుంచి నిరంతరాయంగా ముసురు పడుతుండటంతో స్తంభంపై వైర్లకు కార్బన్ వచ్చి ఉండవచ్చని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే దారి కావడం.. మంటలు వ్యాపిస్తున్న సమయంలో అటువైపుగా ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభంపై మంటలు ఎక్కువ కావడంతో స్థానికులు అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేస్తున్నారు.

## బస్సులో నుంచి కిందపడి విద్యార్థికి గాయాలు

**అక్షరటుడే, లింగంపేట :** ఆర్టీసీ బస్సు నుంచి ఓ విద్యార్థి కింద పడిన ఘటన లింగంపేట మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. లింగంపేట నుంచి గోపాల్‌పేటకు వెళ్తున్న క్రమంలో వరుణ్ మోటార్స్ సమీపం వరకు రాగానే బస్సులో ప్రయాణిస్తున్న శెట్టిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో ఈ ఘటనలో విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి చికిత్స పొందుతున్నాడు.

# తగ్గిన నేరాలు.. పెరిగిన జరిమానాలు

- బ్లాక్‌స్పాట్స్ గుర్తింపుతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ
- అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలకు చెక్
- అర్ధవార్షిక క్రైం నివేదికను విడుదల చేసిన ఎస్పీ రాజేశ్ చంద్ర

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలో క్రైం రేటు గతంతో పోలిస్తే తగ్గింది. జిల్లా పోలీస్ యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక చర్యలతో నేరాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. వాహనాల తనిఖీలు, జరిమానాలు పెరిగాయి. మొబైల్ రికవరీలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30 వరకు జరిగిన నేరాలు, తీసుకున్న చర్యల వివరాలను ఎస్పీ రాజేశ్ చంద్ర విడుదల చేశారు.

### తగ్గిన రోడ్డు ప్రమాదాలు

గతంలో జాతీయ రహదారులపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవి. దీంతో ఎస్పీ రాజేశ్ చంద్ర ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించారు. మొత్తం 28 బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. గతేడాది తొలి అర్ధభాగంలో 317 ప్రమాదాలు జరగగా ఈ సంవత్సరం 282కు తగ్గాయి.

### వాహనాల తనిఖీలు

జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. 6 నెలల్లో 75,179 లైసెన్స్ లేని వారిని గుర్తించి వారికి చలాన్లు విధించారు. ఓవర్ స్పీడ్ 43,348, హెల్మెట్ ధరించని వారు 16,340, డ్రంక్ అండ్ డ్రైవ్ 5,942 మందిని గుర్తించి చలాన్లు విధించారు. మరోవైపు చోరీ కేసులు తగ్గాయి. గతేడాది ఇదే సమయంలో 259 చోట్ల దొంగతనాలు జరగ్గా.. ప్రస్తుతం 214 చోరీలు జరిగాయి. ప్రజలలో అవగాహన కల్పించడం, గస్తీ దళాలు ఏర్పాటు చేయడంతో చోరీల సంఖ్య తగ్గింది.

### కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పెండింగ్ కేసులపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఈ ఏడాది 6 కేసుల్లో నిందితులకు జీవితఖైదు, 12 కేసుల్లో ఏడేళ్ల లోపు శిక్షలు పడ్డాయి. అలాగే జిల్లాలో ప్రధాన రహదారులపై దోపిడీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా (పార్థీ గ్యాంగ్)కు చెందిన 11మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

### మొబైల్ రికవరీలో టాప్

పోగొట్టుకున్న మొబైల్స్ రికవరీలో కమిషనరేట్లు మినహాయించి రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఇప్పటివరకు 3,265 ఫోన్లను రికవరీ చేశారు. 6 నెలల్లో 452 మొబైల్స్ స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. పోలీసుల పనితీరును మెరుగుపర్చడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే ఉద్దేశంతో కామారెడ్డి జిల్లా పోలీసు కొత్త లోగోను ఆవిష్కరించారు. డయల్ 100కు 22,102 కాల్స్ రాగా 137 కేసులు నమోదు చేశారు.

### కారుణ్య నియామకాలు.. బదిలీలు

జిల్లాలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించడంలో ఎస్పీ సక్సెస్ అయ్యారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చారు. అలాగే హోంగార్డుల నుంచి ఏఎస్సైల వరకు బదిలీలను విజయవంతంగా పూర్తిచేశారు.

### నేరాలు తగ్గేలా చర్యలు

రానున్న ఆరు నెలల కాలంలో నేరాలు మరింత తగ్గేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా నిఘా ఏర్పాటు చేస్తాం. పోలీస్ శాఖ తరఫున సూచనలు, జాగ్రత్తలను సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తాం. – రాజేశ్‌చంద్ర, ఎస్పీ